నమస్తే తెలంగాణ
ములుగు
జయశంకర్ భూపాలపల్లి
5 | వరంగల్, ఆదివారం 16 ఫిబ్రవరి 2025 | MULUGU JAYASHANKAR BHUPALPALLY

- మంత్రి మెప్పు కోసం తప్పుల మీద తప్పులు
- బీఆర్ఎస్ నాయకులపై ఆగని వేధింపులు
- అగ్రంపహాడ్ జాతర ఘటనలో బాధితులకు బెదిరింపులు
- బాధితుల ప్రైవేట్ కేసులో పోలీసులకు నోటీసులు
- మార్చి 6న హాజరుకావాలని కోర్టు ఆదేశాలు

ఆత్మకూరు పోలీసులు తీవ్రంగా కొట్టిన గాయాలను చూపిస్తున్న బీఆర్ఎస్ నాయకులు(ఫైల్)

ఇదేనా ఫ్రెండ్లీ పోలీస్

వరంగల్, ఫిబ్రవరి 15(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : కాంగ్రెస్ ప్రభుత్వంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలపై పోలీసుల వేధింపులు ఆగడం లేదు. అన్యాయంగా కొట్టడంతో పాటు కోర్టు ఉత్తర్వులను ఉల్లంఘించేలా పోలీసులు వ్యవహరిస్తున్నారు. మంత్రి, అధికార పార్టీ ఎమ్మెల్యే మెప్పు పొందేందుకు జాతరలో బీఆర్ఎస్ నాయకులను ఇష్టం వచ్చినట్లు కొట్టిన పోలీసులు తప్పును కప్పిపుచ్చుకునేందు వరుసగా అలాగే చేస్తున్నారు. వేధింపులకు గురి చేసిన పోలీసులపై బీఆర్ఎస్ ఒత్తిడితో శాఖాపరమైన విచారణ మొదలైనా ముందుకు సాగడం లేదు. న్యాయం చేయాలంటూ బీఆర్ఎస్ కార్యకర్తలు ప్రైవేట్గా కోర్టుకు వెళ్లడంతో పోలీసులకు నోటీసులు జారీ అయ్యాయి. మార్చి 6న హాజరు కావాలని హైకోర్టు ఆదేశాలు ఇచ్చింది. అయినా పోలీసులు అలాగే వ్యవహరిస్తున్నారు. ప్రైవేట్ కేసు నమోదు చేసిన బాధితులను బెదిరింపులకు గురిచేస్తున్నారు. తమపై కేసు పెట్టిన వారిని వదిలేది లేదని హెచ్చరిస్తున్నారు.

గతేడాది ఫిబ్రవరిలో హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండలం అగ్రంపహాడ్లోని సమ్మక్క సారలమ్మ జాతరలో పోలీసుల అత్యుత్సాహంతో 12మంది బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను తీవ్రంగా కొట్టారు. అనంతరం వారిని పోలీసు స్టేషన్కు పిలిపించి థర్డ్ డిగ్రీ ప్రయోగించారు. దీంతో బీఆర్ఎస్ నాయకులకు తీవ్ర గాయలయ్యాయి. ఈ ఘటన అప్పట్లో రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. బీఆర్ఎస్ కార్యకర్తల నిరసనలు, పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడి ఒత్తిడితో వరంగల్ పోలీసు కమిషనర్ చర్యలు చేపట్టారు. ఆత్మకూరు ఎస్సై దుర్గాప్రసాద్ను సస్పెండ్ చేశారు. పరకాల ఏసీపీ, కిశోర్ కుమార్, ఆత్మకూర్ సీఐ సంతోష్కుమార్, దామెర ఎస్సై అశోక్పై శాఖాపరమైన విచారణకు ఆదేశించారు. మామునూరు ఏసీపీ తిరుపతి, భూపాలపల్లి అదనపు ఎస్పీ బోనాల కిషన్లను విచారణ అధికారులుగా నియమించారు. విచారణ సమయంలోనూ ఆరోపణలు ఎదుర్కొంటున్న పోలీసులు బాధితులను బెదిరించారు. విచారణ జరిగే చోటుకి వెళ్లి పోలీసులకు వ్యతిరేకంగా

మారని ఖాకీల వైఖరి

చెప్పొద్దని హెచ్చరించారు. కేసులు ఉపసంహరించుకోవాలని, మీరు ఎక్కడి వెళ్లలేరని పోలీసులకు వ్యతిరేకం చెబితే తర్వాత కష్టాలు పడాల్సి వస్తుందని బెదిరించారు. పీడీ యాక్టులు, రౌడీషీట్లు నమోదు చేస్తామని భయపెట్టారు. ఆత్మకూరు, దామెర పోలీస్స్టేషన్లకు బాధిత బీఆర్ఎస్ నాయకులను పిలిపించి తీవ్రస్థాయిలో బెదిరించారు. సీఐ సంతోష్, దామెర ఎస్సై అశోక్ బూతులు తిట్టారు. మొత్తంగా ఘటనతో ఫ్రెండ్లీ పోలీసింగ్ అనేది లేకుండా చేశారు. శాఖా పరమైన విచారణతోనూ న్యాయం జరగదనే ఆందోళనతో బాధితులు కోర్టులో ప్రైవేటు కేసు నమోదు చేశారు. ఆ తర్వాత బాధితులకు వేధింపులు మరింత పెరిగాయి. ఆత్మకూరు సీఐ సంతోష్, దామెర ఎస్సై అశోక్ బాధితులపై అక్రమ కేసులు బనాయించారు. కొందరిపై రౌడీ షీట్ కేసులు నమోదు చేశారు. పోలీసులపై పెట్టిన ప్రైవేటు కేసును వాపసు తీసుకోకుంటే భవిష్యత్తు ఉండదంటూ బెదిరిస్తున్నారని బాధితులు వాపోతున్నారు.

మార్చి 6న కోర్టుకు రావాలని పోలీసులకు నోటీసులు

గతేడాది అగ్రంపహాడ్ సమ్మక్క సారలమ్మ జాతరలో తలెత్తిన చిన్న వివాదాన్ని సాకుగా చూపిస్తూ 10మంది బీఆర్ఎస్ కార్యకర్తలపై కేసులు నమోదు చేసి పరకాల ఏసీపీ ఆధ్వర్యంలో ఆత్మకూరు ఎస్సై విచక్షణారహితంగా దాడి చేయడంపై బీఆర్ఎస్ లీగల్ ఆధ్వర్యంలో హనుమకొండ జిల్లా కోర్టులో దాఖలు చేసిన ప్రైవేటు కేసులోని పరకాల అప్పటి ఏసీపీ కిషోర్ కుమార్, ప్రస్తుత ఆత్మకూరు సీఐ సంతోష్, ఎస్సై ప్రసాద్, అశోక్ మార్చి 6న కోర్టుకు హాజరు కావాలని కోర్టు ఆదేశాలు జారీ చేసింది. బీఆర్ఎస్ ఉమ్మడి వరంగల్ లీగల్ సెల్ అధ్యక్షుడు గుర్రాల వినోద్ కుమార్ ఈ విషయాన్ని ఓ ప్రకటనలో తెలిపారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలపై పోలీసుల వేధింపుల విషయంపై మానవ హక్కుల కమిషన్లో మరో కేసు పెండింగ్లో ఉన్నదని చెప్పారు.

ఇదీ జరిగింది..

మేడారం జాతర సమయంలోనే అగ్రంపహాడ్లోనూ జాతర జరుగుతుంది. గతేడాది ఫిబ్రవరి 23న పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి పరకాల ఏసీపీకి, అక్కడి ఆలయ ఈవోకు సమాచారం ఇచ్చి దర్శనానికి వెళ్లారు. ధర్మారెడ్డి అక్కడికి వెళ్లే సమయానికి గేట్లు మూసి పెట్టి ఈవో, ఇతర అధికారులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. అక్కడికి భారీగా చేరిన భక్తులు, బీఆర్ఎస్ కార్యకర్తలలో కొందరు... జై చల్లా, జై తెలంగాణ అని నినాదాలు చేశారు. తర్వాత గేట్లు తీసిన తర్వాత దర్శనం చేసుకుని వచ్చారు. ఆ తర్వాత అందరూ అక్కడి నుంచి వెళ్లిపోయారు. కొట్లాట, ఘర్షణ అసలే లేదు. రాజకీయ ఒత్తిడితో ఆ తర్వాత రోజు వేధింపుల ప్రక్రియ మొదలైంది. జాతర వద్ద డ్యూటీలో ఉన్న తనను తోసుకుంటూ వెళ్లారని ఆరోపిస్తూ అదే రోజు రాత్రి ఆత్మకూరు పోలీసు స్టేషన్లో ఓ కానిస్టేబుల్తో ఫిర్యాదు చేశారు. ఐపీసీలోని 143, 149, 353 సెక్షన్లతో పన్నెండు మంది బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలపై శనివారం రాత్రి(ఫిబ్రవరి 24న) కేసు పెట్టారు. పోలీసు స్టేషన్లో బెయిల్ ఇచ్చే సెక్షన్లే కావడంతో సోమవారం పోలీసు స్టేషన్కు వెళ్లి రావాలని బాధితులు భావించారు. ఏసీపీ కిశోర్, సీఐ సంతోష్ ఆదేశాలతో ఎస్సై ప్రసాద్ ఆధ్వర్యంలో శనివారం అర్ధరాత్రి ఆత్మకూరు పోలీసులు 12 మందిని హనుమకొండలోని టాస్క్ ఫోర్స్ ఆఫీసుకు తీసుకొచ్చారు. అక్కడ డ్రాయరు మాత్రమే ఉండేలా అందరితో బట్టలు విప్పించారు. ఒక్కొక్కరిపై ఐదారుసార్లు థర్డ్ డిగ్రీ ప్రయోగించారు. రోకలిబండలు ఎక్కించారు. బెల్టులతో పిరుదులపై కొట్టారు. పోలీసుల దుశ్చర్యలపై ఫిబ్రవరి 25న ఉదయం వరంగల్ పోలీసు కమిషనర్కు బీఆర్ఎస్ నేతలు ఫిర్యాదు చేశారు. మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ఆత్మకూరు స్టేషన్లో బెయిలు తీసుకుని బాధితులను విడిపించారు. బాధితుల ఫిర్యాదుతో ఆ తర్వాత ఆత్మకూరు ఎస్సైని సస్పెండ్ చేశారు. ప్రస్తుతం కేసుపై విచారణ కొనసాగుతున్నది.

పోలీస్స్టేషన్లో అరెస్ట్ అయిన కార్యకర్తలకు మనోధైర్యం కల్పిస్తున్న దయాకర్రావు

అధికార దర్పంతో అక్రమ అరెస్ట్లు తగదు

- పోలీసులు ఏకపక్ష తీరు మానుకోవాలి
- మాజీ మంత్రి దయాకర్రావు

రాయపర్తి, ఫిబ్రవరి 15 : అధికార దర్పంతో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలపై కాంగ్రెస్ నేతలు అక్రమ కేసులు నమోదు చేయించడం సరికాదని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్రావు మండిపడ్డారు. రాయపర్తి మండలం మైలారంలో ఈనెల 13న రాత్రి గ్రామదేవతలు దుర్గామాత, మారెమ్మల ఉత్సవాల్లో పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి బోనం ఎత్తుకుని మారెమ్మ ఆలయానికి వెళ్తున్న క్రమంలో గ్రామానికి చెందిన బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు పరుపాటి శ్రీనివాస్రెడ్డి, రంగు కుమార్, బిల్ల సుధీర్ రెడ్డి, ఈదులకంటి రవీందర్రెడ్డి ఆధ్వర్యంలో ఇరు పార్టీల నాయకులు పెద్ద ఎత్తున హాజరై తాము ముందు వెళ్తామంటే తాము వెళ్తామంటూ ఘర్షణకు దిగారు. ఈ క్రమంలో ఎమ్మెల్యే వాహనాన్ని అడ్డుకొని, వాగ్వాదానికి దిగడంతో స్థానిక ఎస్సై కొంగ శ్రవణ్కుమార్, సిబ్బంది వారికి నచ్చజెప్పి ఎమ్మెల్యేను అక్కడినుంచి పంపించేశారు. అయితే ఉత్సవాలకు రాకుండా ఎమ్మెల్యేను అడ్డుకున్నారంటూ అధికార పార్టీ నేతలు చేసిన ఫిర్యాదుతో పోలీసులు బీఆర్ఎస్ కార్యకర్తలు లేతాకుల మధూకర్రెడ్డి, బైరు యాకన్న, కోల సంపత్, గబ్బెట అనిల్కుమార్లను శనివారం అరెస్ట్ చేసి రిమాండ్కు తరలించారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి.. బీఆర్ఎస్ మండల నాయకులతో కలిసి పోలీస్స్టేషన్కు వెళ్లి మైలారంలో జరిగిన గొడవ, బీఆర్ఎస్ కార్యకర్తలను ఎందుకు అరెస్ట్ చేశారో అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసమర్థ కాంగ్రెస్ ప్రభుత్వానికి పరిపాలన చేతగాక ప్రతిపక్ష నాయకులు, కార్యకర్తలను ఇబ్బంది పెడుతూ రాక్షసానందం పొందుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. అధికార దర్పంతో ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి, కాంగ్రెస్ నేతలు ఇప్పటికైనా ఇలాంటి చర్యలు మానుకోవాలని హితవు పలికారు. ఘర్షణకు దిగిన కాంగ్రెస్ నేతలను ఎందుకు అరెస్ట్ చేయలేదని ఎర్రబెల్లి ప్రశ్నించారు. పోలీసులు ఇప్పటికైనా ఏకపక్ష వైఖరి మానుకోవాలని ఆయన కోరారు. ఇక్కడ బీఆర్ఎస్ జిల్లా నాయకుడు పరుపాటి శ్రీనివాస్రెడ్డి, మండల ఇన్చార్జి పల్లా సుందర్ రాంరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు మునావత్ నర్సింహనాయక్, మండల నాయకులు జినుగు అనిమిరెడ్డి, రంగు కుమార్, ఎలమంచ శ్రీనివాస్రెడ్డి, సందిదేవేందర్రెడ్డి, గుడి మైబురెడ్డి ఉన్నారు.

విత్తన వరి సిరులు

- పోటీ పడిన విత్తన కంపెనీలు
- వాతావరణం అనుకూలించడంతో ఏపుగా పెరిగిన పంట
- ఎకరాకు రూ. లక్ష వరకు వచ్చే అవకాశం
- సంతోషం వ్యక్తం చేస్తున్న రైతులు

విత్తన వరి సాగు సిరులు కురిపించనుంది. ప్రపంచ వ్యాప్తంగా ఏర్పడిన విత్తన కొరతతో ప్రైవేట్ కంపెనీలు ఈ సారి రైతులతో పెద్ద ఎత్తున సాగు చేయించేందుకు పోటీపడ్డాయి. దీంతో రికార్డు స్థాయిలో ఉత్తర తెలంగాణ జిల్లాల్లో సుమారు 2 లక్షల ఎకరాల్లో ఆడమగ వరిని నాటారు. విత్తన వరి రాజధానిగా హుజూరాబాద్ వెలుగొందుతుండగా, పక్కన ఉన్న ఎల్కతుర్తి మండలంలో 8 వేలు, కమలాపూర్లో 10 వేల ఎకరాల్లో రైతులు సాగు చేస్తున్నారు. వాతావరణం కూడా అనుకూలించడంతో పంట ఏపుగానే పెరుగుతున్నది. ఈసారి పెట్టుబడి పోను రూ.80 వేల నుంచి లక్ష వరకు ఆదాయం లభించనుందనే అశాభావం అన్నదాతల్లో వ్యక్తమవుతున్నది.

- హనుమకొండ సబర్బన్, ఫిబ్రవరి15

రైతులు సాగు చేస్తున్న విత్తన వరి సాగు

భారీగా పెరిగిన మేల్ ఫిమేల్ సాగు

ఉమ్మడి రాష్ట్రంలో పెద్ద ఎత్తున విత్తన వరి పండించిన రైతులు ఆర్గనైజర్ల మోసాల వల్ల చాలా మంది సాగుకు దూరమయ్యారు. తెలంగాణ రావడంతో ధాన్యాన్ని ప్రభుత్వం పెద్ద ఎత్తున కొని రైతు బ్యాంకు ఖాతాలో డబ్బులు జమ చేయడంతో వారు సాధారణ వరి రకాల సాగు వైపు దృష్టి సారించారు. దీంతో ఆయా విత్తన కంపెనీలు ఇతర ప్రాంతాల వైపు మళ్లాయి. కొత్త ప్రాంతాల్లో విత్తన వరి సాగు చేసేందుకు ప్రయత్నించగా ప్రతికూల వాతావరణం వల్ల బెడిసి కొట్టింది. దీనికి తోడు అన్ని విత్తన కంపెనీల వద్ద విత్తన నిల్వలు పూర్తిగా తరిగిపోయాయి. దీంతో ఆయా కంపెనీలకు దేశీయ, విదేశీ అవసరాల కోసం పెద్ద ఎత్తున విత్తనాలు కావాల్సి వచ్చింది. తప్పని పరిస్థితుల్లో ఆయా కంపెనీలు ఉత్తర తెలంగాణ వైపు రాక తప్పలేదు. అయితే గత అనుభవాల దృష్ట్యా సాగు విషయంలో రైతులు విముఖత చూపినా కంపెనీలు వారిని ప్రసన్నం చేసుకుని విజయం సాధించాయి. దీంతో దేశవ్యాప్తంగా గతంలో సగటున 1.5 లక్షల ఎకరాల్లో సాగయిన మేల్ ఫిమేల్ వరి సాగు ఈ సారి 3 లక్షల ఎకరాలకు పెరగం విషేశం. అందులో ఉత్తర తెలంగాణలోనే 2 లక్షల ఎకరాల్లో విత్తన వరి సాగయ్యింది. దీనికి ప్రభుత్వం ఇస్తానన్న సన్నవడ్ల బోనస్ మెజా రిటీ రైతులకు ఎగ్గొట్టడం కూడా కారణంగా నిలిచిందని చెప్పవచ్చు.

విత్తన వరిని పరిశీలిస్తున్న కంపెనీ ప్రతినిధులు

రైతులకు మంచి లాభాలు వచ్చే అవకాశం

ఈసారి అన్ని కంపెనీలకు విత్తనం పెద్ద ఎత్తున అవసరం పడింది. అందుకే ఆడమగ వరిని సాగు చేయించేందుకు పోటీ పడ్డాయి. ప్రస్తుతం అన్ని చోట్లా వరి నార్లు ముగిసి కలుపు దశలో ఉన్నాయి. ఇప్పటివరకైతే వాతావరణం అనుకూలంగా ఉండి పంట ఏపుగానే పెరుగుతున్నది. ఇలానే ఉన్నట్లయితే రైతులకు మంచి లాభాలు వచ్చే అవకాశం ఉంది.

– పామెర సుమన్రావు, కావేరి విత్తన కంపెనీ ప్రతినిధి

ఇప్పటి వరకైతే బాగానే ఉంది

నేను పదేండ్ల కిందటి వరకు ఆడమగ వరిని పండించిన. తర్వాత లాభం ఎక్కువ లేదని మా పిలగాండ్లు వద్దంటే ఊకున్న. ఈ యాసంగిల మాత్రం కంపెనోళ్లు అచ్చి అన్ని మేమే సూసుకుంటమన్నరు. ఈసారి ఆరెకరాలల్ల ఆడమగ వరి పెట్టిన. పండినంక క్వింటాకు రూ. 14 వేలు ఇత్తనన్నరు. మా తెలిసిన సారే ఇత్తనం ఇచ్చిండు. వరి సుత మంచిగనే వత్తాంది.

– గూడెపు సమ్మయ్య, రైతు, ఎల్కతుర్తి

రైతులను ఆకర్షించేలా కంపెనీల ఆఫర్లు

పంట పండకుంటే రూ.70 వేల నుంచి 90 వేల వరకు పరిహారం ఇచ్చేలా రైతులకు కంపెనీలు ముందుగానే బాండ్ రాసిచ్చాయి. వరి గొలుసులు మొత్తం ఒకేసారి బయటకు వచ్చేలా వినియోగించే జిబ్రాలిక్ ఆసిడ్(జియే-3) మందును కూడా ఉచితంగా ఇవ్వడంతో పాటు కోత ఖర్చులను కూడా కంపెనీలే భరిస్తాయి. ఇక గతానికంటే వడ్లకు కూడా కిలోకు రూ. 50 వరకు ధరను పెంచాయి. ఆయకం పెనీలను బట్టి రూ.12 వేలు మొదలుకుని 16 వేల వరకు ధర ఇస్తున్నాయి. అంటే దాదాపుగా పెట్టుబడి పోను రైతులకు రూ.80 వేల నుంచి లక్ష వరకు లాభం రావచ్చనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. వాతావరణం కూడా ఇప్పటికైతే అనుకూలంగానే కనిపిస్తున్నట్లుగా చెబుతున్నారు. మన రైతులు పండించిన వరి విత్తనం ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, ఉత్తర ప్రదేశ్, పశ్చిమ బెంగాల్, బీహార్, మధ్యప్రదేశ్తో పాటు బంగ్లాదేశ్, చైనా, పిలిప్పీన్స్, వియత్నాం లాంటి ఇతర దేశాలకు కూడా సరఫరా కావడం విషేశం.

46 ఎకరాల్లో విత్తన వరిని వేశా

నాకు గ్రామంలో 36 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. మరో 10 ఎకరాలు కౌలుకు తీసుకుని 46 ఎకరాల్లో ఆడమగ వరి సాగు చేస్తున్నా. ఈసారి పలు రకాల కంపెనీలు రైతులను ప్రోత్సహిస్తున్నాయి. నేను మూడు రకాల వెరైటీలు సాగు చేస్తున్నా. కొంచెం రిస్క్ ఉన్నప్పటికీ మంచి లాభాలు వచ్చే అవకాశాలున్నాయి. పాలినేషన్ ప్రక్రియ చేపట్టేందుకు కూలీలను ముందుగానే ఎంగేజ్ చేసుకున్నా.

– గుజ్జ శ్యాంసుందర్రావు, రైతు, గోపాల్పూర్, హనుమకొండ జిల్లా

దమ్ముంటే రాజీనామా చెయ్

- ఎమ్మెల్యే మురళీనాయక్కు శంకర్నాయక్ సవాల్
- ఆయన గెలిస్తే రాజకీయ సన్యాసం తీసుకుంటానని స్పష్టం
- సేవాలాల్ ర్యాలీలో మాజీ ఎమ్మెల్యేను అడ్డుకున్న పోలీసులు
- మానుకోటలో భారీ బందోబస్తు నడుమ సేవాలాల్ జయంతి

భారీ బందోబస్తు నడుమ మాజీ ఎమ్మెల్యే శంకర్నాయక్ను సేవాలాల్ గుడికి తీసుకెళ్తున్న పోలీసులు

మహబూబాబాద్ రూరల్, ఫిబ్రవరి 15 : మహబూబాబాద్ రూరల్, ఫిబ్రవరి 15 : మహబూబాబాద్ ఎమ్మెల్యే మురళీనాయక్ దమ్ముంటే రాజీనామా చేసి గెలవాలని.. ఒకవేళ తనపై గెలిస్తే రాజకీయ సన్యాసం తీసుకుంటానని మాజీ ఎమ్మెల్యే శంకర్నాయక్ సవాల్ విసిరారు. నియోజకవర్గం అంతటా ఎమెల్యేపై వ్యతిరేకత ఉన్నదని నెల్లికుదురు, ఇనుగుర్తి మండలాల్లో ప్రజలకు సంక్షేమ పథకాలు అందడం లేదని మురళీనాయక్ను ప్రజలు అడ్డుకున్నారన్నారు. శనివారం సేవాలాల్ జయంతి సందర్భంగా మహబూబాబాద్ శివారు అనంతారం వద్ద నిర్వహించిన వేడుకలకు శంకర్నాయక్ దంపతులు గిరిజనులతో కలిసి ర్యాలీగా బయలుదేరగా పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించారు. అప్పటికే భారీగా మోహరించిన పోలీసులు స్థానిక ఎమ్మెల్యే మురళీనాయక్ దంపతులు ముందుగా ర్యాలీగా వెళ్తారని శంకర్నాయక్ ర్యాలీని అడ్డుకున్నారు. దీంతో శంకర్నాయక్ వర్గీయులకు, పోలీసులకు మధ్య వాగ్వాదం నెలకొని ఉద్రిక్తత చోటు చేసుకుంది. కొంత సమయం తర్వాత ఎమ్మెల్యే ర్యాలీ వెళ్లిన అనంతరం శంకర్నాయక్ ర్యాలీని పంపించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి ప్రతి ఒక్కరు సుఖ సంతోషాలతో ఉండాలని, సేవాలాల్ బాటలో నడవాలన్నారు. కాగా గుడి వద్ద ఎలాంటి ఘర్షణ జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటుచేశారు. ఉత్సవాల అనంతరం శంకర్నాయక్ విలేకరులతో మాట్లాడారు. పదేళ్ల కేసీఆర్ పాలనలో సేవాలాల్ మహరాజ్ జయంతిని ఘనంగా నిర్వహించామన్నారు. సబ్బండ వర్గాల పండుగలకు ప్రాధ్యానత ఇచ్చిందని, హిందువులకు బతుకమ్మ చీరలు, ముస్లింకు రంజాన్ కిట్లు, క్రైస్తవులకు క్రిస్మస్ గిఫ్టులు అందిస్తే కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత అన్నీ మాయమయ్యాయని పండుగలకు ప్రాముఖ్యత లేకుండా చేసిందన్నారు. ఎన్నికలకు ముందు ఆరు గ్యారెంటీలు, 420 హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కారు వీటిని అమలు చేయడంలో విఫలమైందన్నారు. రైతు రుణమాఫీ కాక, రైతుభరోసా అందక, తులం బంగారం, బోనస్ డబ్బుల కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారని కాంగ్రెస్ పార్టీ నాయకులు గ్రామాల్లో తిరగలేని పరిస్థితులు నెలకొన్నాయని పేర్కొన్నారు. సీఎం రేవంత్రెడ్డి వెంటనే ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని శంకర్నాయక్ డిమాండ్ చేశారు.



మొక్కలు నాటి సెల్ఫీ దిగి

కేసీఆర్ పుట్టిన రోజున ప్రతి ఒక్కరూ మూడు మొక్కలు నాటాలి

వృక్షార్చనను సక్సెస్ చేయాలని మాజీ ఎమ్మెల్యేలు నరేందర్, పెద్ది పిలుపు

కరీమాబాద్/ నల్లబెల్లి, ఫిబ్రవరి 15 : ఈ నెల 17న తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ పుట్టినరోజు వేడుకలను పురస్కరించుకొని శనివారం వరంగల్లోని ఉర్సు లో వరంగల్ తూర్పు మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ మొక్కలు నాటి సెల్ఫీ దిగారు. నల్లబెల్లి మండలంలోని నందిగామలో మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్రెడ్డి మొక్కలు నాటారు. గ్రీన్ ఇండియా చాలెంజ్లో భాగంగా ప్రతి ఒక్కరూ మూడు మొక్కలు నాటి వృక్షార్చన కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని ఆయన పిలుపునిచ్చారు. నాటిన మొక్కలతో సెల్ఫీ తీసుకొని 900036 5000 నంబర్కు వాట్సాప్ చేయాలని కోరారు.

ఔషధాల లెక్క పక్కాగా ఉండాలి

- వైద్య, ఆరోగ్యశాఖ జాయింట్ డైరెక్టర్ బీ ప్రేమ్కుమార్
- ప్రభుత్వ దవాఖానల్లో టాస్క్ఫోర్స్ బృందం తనిఖీలు
- నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరిక

వరంగల్ చౌరస్తా, ఫిబ్రవరి 15 : ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ దవాఖానాల్లో ఆకస్మిక తనిఖీలు చేసేందుకు తెలంగాణ మెడికల్ బోర్డ్ కార్యదర్శి, వైద్య, ఆరోగ్యశాఖ జాయింట్ డైరెక్టర్ బీ ప్రేమ్కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన టాస్క్ ఫోర్స్ బృందం వరంగల్ ప్రాంతీయ నేత్ర వైద్యశాల, వరంగల్ సెంట్రల్ మెడిసిన్ స్టోర్, రంగశాయిపేట, ఎస్ఆర్ఆర్ తోట అర్బన్ హెల్త్ సెంటర్లతో పాటు కేశవపూర్ పీహెచ్సీని ఆకస్మికంగా తనిఖీ చేసింది. ఊహించని విధంగా తనిఖీలు నిర్వహించడంతో వైద్యాధికారులు, ఉద్యోగులు ఉలిక్కిపడ్డారు. రోగులకు అందిస్తున్న మందులు, చిన్నారులకు ఇచ్చే వ్యాక్సిన్ల నిల్వలను క్షుణ్ణంగా పరిశీలించారు. వార్షిక నిల్వల రికార్డుల ఆధారంగా నిల్వలను తనిఖీ చేశారు. ఎప్పటికప్పుడు నిల్వల వివరాల ను ఈ-ఔషధి సైట్ లో పారదర్శకంగా అప్లోడ్ చేయాలని ఫార్మసిస్టులకు సూచించారు. భవిష్యత్తులో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలు, దవాఖానల్లో ఆకస్మిక తనిఖీలు చేస్తామని విధుల పట్ల నిర్లక్ష్యంగా ఉన్న అధికారులు, ఉద్యోగులు, సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. మందుల నిల్వల విషయంలో అప్రమత్తంగా వ్యవహరించాలని, సీజనల్ వ్యాధులు, వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. టీం సభ్యులు ప్రొఫెసర్ సయ్యద్ అహ్మద్, ఫుడ్ సేఫ్టీ అధికారి ధర్మేంద్ర, వరంగల్ జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి సాంబశివరావు, ఉమ్మడి జిల్లా సెంట్రల్ డ్రగ్ స్టోర్ ఇన్చార్జ్ ఫార్మసిస్ట్ ఉప్పు భాస్కర్రావు, ఫార్మసీ సూపర్వైజర్ నాగమణి, సుధాకర్రెడ్డి, గ్రేడ్-1 ఫార్మసిస్ట్ నళిని, ప్రాంతీయ నేత్ర వైద్యశాల సూపరింటెండెంట్ భరత్కుమార్, వైద్యాధికారులు విజయ్కుమార్, శశికుమార్రెడ్డి, రమ్య, అనిత పాల్గొన్నారు.

రంగశాయిపేట అర్బన్ హెల్త్ సెంటర్లో మందులను తనిఖీ చేస్తున్న టాస్క్ఫోర్స్ బృందం